నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 8 జూన్ 2024 RANGAREDDY



## అత్యవసర సేవలపై ఈవీడీఎం శిక్షణ

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలంలో ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయ చర్యలపై జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. నాగోల్ ఫతుల్లాగూడలోని ట్రైనింగ్ సెంటర్‌లో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరదలతో ముంపు, ప్రాణాపాయ పరిస్థితులు, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి? ప్రమాదం జరిగినప్పుడు ఏం చేయాలి..? అన్న విషయాలపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. వచ్చే సోమవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి గల అపార్ట్‌మెంట్, బస్తీ వాసులు, ఎన్జీవో, ట్రేడ్ యూనియన్ సభ్యులు ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.



పరిగి : ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.



# సాగుకు సన్నద్ధం

## పలకరించిన తొలకరి.. రైతన్న బిజీ

వికారాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : నైరుతి రుతుపవనాల రాకతో జిల్లాలో తొలకరి వర్షం పలకరించింది. రెండు, మూడు రోజులుగా జిల్లా అంతటా ఓ మోస్తరు వర్షం కురిసింది. తొలకరి జల్లులు సరైన సమయానికి కురువడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే మోస్తరు వర్షమే కురిసినందునా ఇప్పుడే విత్తనాలను నాటొద్దని జిల్లా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమిలో సరిపడా పదును ఉంటేనే విత్తనాలు నాటాలని, లేదంటే మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. ప్రధానంగా 60 నుంచి 70 మి.మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు నాటితే నాటిన ప్రతి విత్తనం మొలకెత్తే అవకాశముంటుందని అధికారులు ఊరూరా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచారు.

### 5.97 లక్షల ఎకరాల్లో సాగు..

వికారాబాద్ జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5,97,830 ఎకరాల్లో ఆయా పంటలు సాగు అవుతాయని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అందులో పత్తి–2,63,500 ఎకరాలు, కంది–1,50,000, మొక్కజొన్న–50,450, వరి –1,10,000, మినుములు–5,000, సోయాబీన్–2,500, జొన్నలు–2500, పెసర్లు–1,000 ఎకరాల్లో సాగవుతుందని ప్రణాళికను రూపొందించారు. అయితే గతేడాది వానకాలంలో జిల్లాలో 5.81 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు కాగా, వరి–1,34,857 ఎకరాలు, మొక్కజొన్న–55,751, జొన్నలు–2033, కందులు–1,31,284, పెసర్లు–13,453, మినుములు–5175, పత్తి–2,30,285 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మరోవైపు సరిపడా విత్తనాలు, ఎరువులను జిల్లా యంత్రాంగం రైతులకు అందుబాటులో ఉంచింది. అయితే ఈ ఖరీఫ్‌లో 5,45,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు భావించి ఇప్పటికే 3,14,525 ప్యాకెట్ల పత్తి విత్తనాలను నిల్వ చేయగా.. రైతులు 59,458 పత్తి విత్తనాల ప్యాకెట్లను కొనుగోలు చేశారు. అదేవిధంగా వరికి సంబంధించి 27,500 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న– 4036 క్వింటాళ్లు, పెసర్లు–1040, కందులు–4500 క్వింటాళ్లు, మినుములు–400 క్వింటాళ్లు, సోయాబీన్–750 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో పీఏసీఎస్ డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులను సరఫరా చేయాలని నిర్ణయించారు. అన్ని ఎరువులు కలిపి 75, 437 మెట్రిక్ టన్నుల అవసరమని భావిస్తున్నారు. యూరియా–32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ–17,719, కాంప్లెక్స్ ఎరువులు–19,877, ఎంవోపీ–3658 , ఎస్ఎస్పీ–1854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనా వేసి.. యూరియా–15,317 మెట్రిక్ టన్నులు, డీఏపీ–1273, కాంప్లెక్స్ ఎరువులు –2477, ఎంవోపీ– 192, ఎస్ఎస్పీ– 106 మెట్రిక్ టన్నుల ఎరువులను జిల్లాలోని గోదాముల్లో ఇప్పటికే నిల్వ ఉంచారు.

### కురిసిన 31.9 మి.మీటర్ల వర్షపాతం..

సరైన పదును ఉంటేనే విత్తనాలను నాటాలని జిల్లా వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. జిల్లా అంతటా 60 మి.మీటర్లకుపైగా వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలను నాటాలని చెబుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు 31.9 మి.మీటర్ల వర్షపాతమే నమోదైంది. అయితే 60మి.మీటర్ల వర్షపాతానికి మించి కేవలం రెండు మండలాల్లోనే వర్షం కురిసింది. అత్యధికంగా కొడంగల్ మండలంలో 116 మి.మీటర్ల వర్షపాతం, బంట్వారం మండలంలో 61.9 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాలకు సంబంధించి... ధారూరు, పెద్దేముల్ మండలాల్లో 49.2 మి.మీటర్లు, బషీరాబాద్ మండలంలో 48.7, మర్పల్లిలో 45.5, కోట్‌పల్లిలో 42.9, యాలాలలో 31.2, దౌల్తాబాద్‌లో 30.1, పూడూరులో 26.1, దుద్యాలలో 26.8, తాండూరులో 23.2, బొంరాస్‌పేటలో 27.2 , వికారాబాద్‌లో 18.8, పరిగిలో 18.3, చౌడాపూర్‌లో 4.6, మోమిన్‌పేటలో 10, నవాబ్‌పేటలో 4.2, దోమ మండలంలో 3.1 మి.మీటర్ల వర్షపాతం ఇప్పటివరకు నమోదైంది.

**వికారాబాద్ జిల్లాలో గత రెండు, మూడు రోజులుగా కురిసిన మోస్తరు వర్షం**

**దుక్కులు దున్ని.. విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్న రైతులు**

**పదును ఉంటేనే విత్తనాలను నాటాలని వ్యవసాయ శాఖ సూచన**

**60-70 మి.మీటర్ల వర్షపాతం దాటితేనే విత్తనాలు నాటాలని రైతులకు అవగాహన**

**అందుబాటులో సరిపడా విత్తనాలు**

**ఈ వానకాలంలో 5.97 లక్షల ఎకరాల్లో పంటల సాగు.. అధికారులు**

### తొందర పడొద్దు..



రైతులెవరూ తొందరపడి ఇప్పుడే విత్తనాలను నాటొద్దు. నేలలో సరిపడా తేమ శాతం వచ్చిన తర్వాతే నాటాలి. మరో ఒకట్రెండు మంచి వానలు కురిసిన తర్వాత నాటితే బాగుంటుంది. ఒకవేళ ఇప్పుడే విత్తనాలను నాటితే విత్తనాలు మొలకెత్తదని, మళ్లీ విత్తనాలను నాటాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వానకాలానికి సంబంధించి సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

## మృగశిర కార్తెతో చేపలకు డిమాండ్



పరిగి మార్కెట్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న జనం

పరిగి, జూన్ 7 : మృగశిర కార్తె రోజు చేపలకు భలే డిమాండ్ ఏర్పడింది. కార్తె ప్రారంభం రోజు తప్పనిసరిగా చేపలు తినాలనే ఆనవాయితీతో ఏటా జనం చేపలు కొనుగోలు చేయడం తెలిసిందే. శుక్రవారం పరిగిలోని మార్కెట్‌యార్డులో చేపల విక్రయాలు జోరుగా జరిగాయి. కొర్రమీను కిలో రూ.500, రవ్వ, బొచ్చ రూ.120, బంగారు తీగ రూ.150 చొప్పున విక్రయించారు.

## పిడుగుపాటుకు 17 జీవాలు మృతి



ఆమనగల్లు మండలం గౌరారం గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులు

కులకచర్ల, జూన్ 7 : పిడుగుపాటుకు వేర్వేరు ఘటనల్లో 17 జీవాలు మృతి చెందాయి. చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన లింగన్నపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపడి ఐదు జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన అలకుంట లాలు అనే రైతు ఐదు పాడి గేదెలను పొలం దగ్గర చెట్టుకు కట్టి వేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ఒక్కసారిగా పిడుగు పడటంతో పాడిగేదెలు మృతి చెందాయి. పాడి గేదెలు మృతి చెందడంతో జీవనోపాధి కోల్పోయానని ఆదుకోవాలని గ్రామస్తులు, రైతు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు. అలాగే పిడుగు పాటుకు పాడి ఆవు మృతి చెందిన ఘటన కులకచర్ల మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామంలో జరిగింది. చెన్నయ్య అనే రైతుకు చెందిన ఆవు పిడుగు పాటుకు మృతి చెందింది. సుమారుగా 80వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు చెన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు.

**ఆమనగల్లు మండలంలో మూడు ఆవులు..**

**ఆమనగల్లు** : పిడుగు పాటుకు మూడు ఆవులు మృతి చెందాయి. ఈ ఘటన మండల పరిధిలో శుక్రవారం జరిగింది. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లిలో రైతు దావ శ్రీను ఒక ఆవు, గౌరారం గ్రామానికి చెందిన రైతు నిట్ట పర్వతాలుకు చెందిన రెండు ఆవులు పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. తాము నష్టపోయామని ప్రభుత్వం చేయూతనివ్వాలని రైతులు కోరారు.

**నందిగామలో మేకలు, గొర్రెలు మృతి**

**నందిగామ** : నందిగామ మండలం దేవునిమామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు బోద్ద శంకరయ్య శుక్రవారం తన మేకలు, గొర్రెలను గ్రామ శివారులో మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కుడిన వర్షం కురవడంతో పిడుగు పడి నాలుగు మేకలు, నాలుగు గొర్రెలు మృతి చెందాయి.

## టీచర్ల బదిలీలు, ప్రమోషన్లకు బ్రేక్

- **జీవో 317పై కోర్టుకెళ్లిన కొందరు ఉపాధ్యాయులు.. కొనసాగుతున్న స్టే**
- **తీవ్ర నిరాశలో రంగారెడ్డి జిల్లాలోని టీచర్లు**
- **ఏండ్ల తరబడిగా తప్పని ఎదురు చూపులు**

రంగారెడ్డి, జూన్ 7 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రహసనంగా మారుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల బదిలీలు, ప్రమోషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయగా.. రంగారెడ్డి జిల్లాను మిన హాయించడం ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నది. వాస్తవానికి టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే జరగాల్సి ఉన్నది. అయితే ప్రమోషన్లకు టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి హైకోర్టు తీర్పు ఇవ్వడం తో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మొత్తం నిలిచిపోయింది. దీంతోపాటు జీవో 317 పై రంగారెడ్డి జిల్లాకు చెందిన టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. పోస్టులు లేకున్నా కొంతమంది టీచర్లు ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు రావడంతో నష్టపోతున్నామంటూ కోర్టుకు విన్నవించుకున్నారు. అప్పటికే బదిలీల కోసం జిల్లాలో 1,878 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోర్టు స్టేతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అలాగే.. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా 65 మందికి, స్కూల్ అసిస్టెంట్లుగా 112 మం దికి ప్రమోషన్లు సైతం నిలిచిపోయాయి. చాలాకాలంగా బదిలీలు, ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న టీచర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం షెడ్యూల్ ప్రకటించి శుభవార్త చెప్పగా..రంగారెడ్డి జిల్లా టీచర్లకు మాత్రం నిరాశే మిగిలింది. కోర్టు స్టే కారణంగా జిల్లాను మినహాయించడంతో ఇన్నాళ్లుగా ఎంతో ఆశతో షెడ్యూల్ కోసం ఎదురుచూసిన టీచర్లకు మళ్లీ భంగపాటే మిగిలింది. కేవలం గ్రేడ్–2 హెచ్ఎంల పదోన్నతులకు మాత్రమే అవకాశమిచ్చారు. గతంలో కొంతమంది ఉద్దేశపూర్వ కంగా కోర్టుకెళ్లి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టకుండా అడ్డుకోగా చాలా మంది టీచర్లు నష్టపోయారు. గతేడాదిలో కోర్టు విధించిన స్టేను వేకెట్ చేయిం చడంలో అధికారులు తాత్సారం చేయడంతో ప్రస్తుతం టీచర్ల బదిలీల ప్రక్రియకు నోచుకోలేకుండాపోతున్నమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు నిలిచిపోయి చివరకు పదోన్నతి పొందకుండానే రిటైరైపోతామేమోనని కొందరు టీచర్లు ఆందోళన చెందుతున్నారు.





# పక్కాగా.. లెక్కింపు

## ఆస్తులు, భవనాల సర్వేకు బల్దియా సిద్ధం

### 18 నెలల పాటు కొనసాగనున్న జీఐఎస్ ఆధారిత సర్వే

### నియో జియో ఏజెన్సీకి బాధ్యతలు అప్పగింత

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో భవనాలు, ఆస్తులను పక్కాగా లెక్కించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ మేరకు జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సాంకేతికతతో సర్వే చేయనున్నారు. దేశంలోని అన్ని పట్టణాలు, నగరాలను మ్యాపింగ్ చేయాలన్న కేంద్ర సర్కారు ఆదేశాలతో.. ఐటీ విభాగం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఆసక్తి ఉన్న సంస్థల నుంచి టెండర్ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. అర్హత కలిగిన నియో జియో ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించింది. 18 నెలల పాటు సర్వే చేసి..రెండేండ్ల పాటు సదరు ఏజెన్సీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహించనున్నది. ఈ సర్వేలో గ్రేటర్‌లో అసలు నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి? వాటిలోని అంతస్తులు, ఎత్తు, విస్తీర్ణం, ఇతరత్రా వివరాలపై డిజిటల్ రికార్డులు రూపుదిద్దుకోనున్నాయి. ప్రతి భవనం సరిహద్దులను తెలుసుకునేందుకు సిటిజన్ సెంట్రిక్ సర్వీస్‌తో ఉపగ్రహ డేటా, డ్రోన్లను ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు. సర్వే వివరాలను ఏ రోజుకు ఆ రోజు సంబంధిత సర్కిల్ అధికారులు సమాచారాన్ని చేరుస్తారు. తద్వారా ఆస్తిపన్ను ఆదాయం పెరుగుతుందని, మౌలిక సౌకర్యాల కల్పనకు నగరాభివృద్ధి ప్రణాళికలకు ఈ సమాచారం ఉపయోగపడనున్నదని అధికారులు తెలిపారు.

### క్లిక్ చేస్తే సమగ్ర వివరాలు..

జీఐఎస్ ఆధారిత సర్వే ఇప్పటికే మహారాష్ట్రలోని బృహన్, ముంబై కార్పొరేషన్ అమలు చేస్తున్నది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ అధికారులు అక్కడి పనితీరును పరిశీలించి వచ్చి నగరంలో అమలుకు సిద్ధమయ్యారు. దాదాపు 20 లక్షల ఇండ్లను సర్వే చేయనున్నారు. ముఖ్యంగా ఇంటి నంబర్లు, వీధులు, కాలనీలను గుర్తించేలా సర్వే ఉంటుంది. ప్రతి ఇంటిని దగ్గర నుంచి చూసినట్లు 3డీ పటాలుంటాయి. క్లిక్ చేస్తే.. నిర్మాణం , ఎన్ని అంతస్తుల్లో ఉన్నది? ఎంత విస్తీర్ణం వంటి వివరాలు తెలుస్తాయి. సమగ్ర డిజిటల్ పటాలతో ఆస్తిపన్ను ఎక్కువగా వసూలయ్యే ఇండ్లు, తక్కువగా చెల్లించేవి.. పన్ను పరిధిలో లేని కట్టడాలను గుర్తించవచ్చు. నివాస అనుమతుల భవనాల్లో వాణిజ్య కార్యకలాపాలు న్నాయా అనేది తెలుసుకునే వీలుంటుంది. పన్ను విధింపులో అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

### 17 లక్షలకు పైగా భవనాలు..

జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను పరిధిలోని భవనాలు 17 లక్షలకు పైగా ఉన్నాయి. ఏటా దాదాపు 20వేల వరకు కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఆ మేరకు ఆస్తిపన్ను రావడం లేదు. ఏటా రూ.1900 కోట్ల మేర ఆదాయం కష్టంగా రాబడుతున్నారు. వాస్తవానికి రూ. 2500 కోట్ల మేర రావాల్సి ఉందని అంచనా. అసెస్‌మెంట్లలోనూ అక్రమాలతో వాస్తవంగా చెల్లించాల్సిన ఆస్తిపన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నారు. సర్వేలో భాగంగా వరద నాలాలు, మురుగునీటి నాలాలు, రహదారులు, చెరువులు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, మురుగునీటి లైన్లు, అపార్ట్‌మెంట్లు, గృహాలు, వాణిజ్య సముదాయాలు, పార్కులు, పచ్చదనం, దవాఖానలు, విద్యా పరిశోధన సంస్థలు, ఖాళీ సంస్థలు, డివిజన్లు, వాటి సరిహద్దులు వంటి అనేక రకాల సమాచారాన్ని తెలుసుకోవచ్చు.